# కళ్యాణ రాగం

"నయాగరా ముందు నిలబడినట్టూ... నందనవనంలోకి అడుగుపెట్టినట్టూ... మధురమైన అనుభూతి కలిగింది ఆ అమ్మాయిని చూసిన మొదటి క్షణంలోనే...! మరుక్షణం..."

"నీ మనసు ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళిపోయింది. అంతేగా...! అలా క్షణాలవారీగా నీ అనుభూతుల్ని వివరించనవసరం లేదు కానీ, మొత్తం మీద విషయం ఏమిటో చెబితే సరిపోతుంది!" ఏదో భావావేశంతో చెప్పుకుపోతున్న రవీంద్ర మాటలకు మధ్యలోనే అడ్డం వచ్చి వేణు అన్నాడు.

"ఏదో నా ఆలోచనల్ని అందంగా చెప్పాలని ప్రయత్నిస్తోంటే... నీకు వినే ఓపిక కూడాలేదా?" అలిగినట్లుగా అన్నాడు రవీంద్ర.

"అందంగా కాదు... అతిశయోక్తిగా చెబుతున్నావ్! అసలు నయాగరానీ, నందనవనాన్నీ నువ్వెపుడు చూశావ్‌రా..? తెలిసినవాటితో పోలిక చెప్పొచ్చుగా...!"

"అలాగా... ఇందాక భోజనాల దగ్గర అమ్మతో 'గుత్తి వంకాయకూర అమృతంలా ఉంది ఆంటీ' అన్నావ్‌గా! మరి అమృతం రుచి నీకెలా తెలుసూ...? విన్నదాన్నిబట్టి కూడా కొన్ని విషయాలు తెలిసినట్లే అనిపిస్తాయి! అవునా...?"

"నీతో మాటల్లో గెలవలేనులే! కాకపోతే... చూసిన మొదటి క్షణం మూర్ఛబోయాను... మరుక్షణం తేరుకున్నాను... మూడోక్షణం మురిసిపోయాను... అంటూ క్షణాలలెక్కన వివరణ ఇస్తోంటే... అసలు సంగతి ఎప్పటికి తెలుస్తుందనే తొందరకొద్దీ అన్నాలే... ఇక చెప్పు!"

బెడ్ మీద పడుకుని మాట్లాడుతున్న రవీంద్ర చటుక్కున లేచి కూర్చుని వేణు భుజాలు పట్టుకుని సీరియస్‌గా అడిగాడు "వేణూ... నేనెలా ఉంటానో చెప్పరా...!"

"అదేం ప్రశ్న! నువ్వు. అచ్చంనీలాగే ఉంటావ్! సందేహం దేనికీ?"

"ఇతరులకి నేనెలా కనిపిస్తానూ అని నా ప్రశ్న!"

"మంచియన్నది పెంచువాడు... దేశమును ప్రేమించువాడు... ఆ టైపులో..."

"అబ్బా...! పెళ్ళిచూపుల్లో అమ్మాయిలకి..."

"మారువేషంలో వచ్చిన మన్మథుడా... కిరీటాన్ని మర్చిపోయిన రాకుమారుడా... అని అనుకునేంత రేంజిలో లేకపోయినాగానీ..."

"నేనెలా ఉండనో వర్ణించాల్సిన అవసరం లేదుగానీ, ఎలా ఉంటానో ఒక్క ముక్కలో చెప్పు. చాలు. యావరేజ్... బిలో యావరేజ్... లేక ఎబౌయావరేజ్...?" వేణు మాటలకు మధ్యలో అడ్డం వచ్చిన రవీంద్ర అన్నాడు.

"ఏదో నేనూ నీలా అందంగా చెప్పాలని ప్రయత్నం చేస్తోంటే... పూర్తిగా వినకుండానే మధ్యలోనే అడ్డంపడ్డావ్! సరే... ఒక్క ముక్కలో చెప్పాలంటే... ఎబౌ యావరేజ్‌కి ఇంకా కొంచెం ఎక్కువేలే!"

"అవును కదా...! మొన్న మేం అందరం ఒకమ్మాయిని చూడటానికి పెళ్ళిచూపులకు వెళ్ళొచ్చామని చెప్పానుగా... అన్ని విషయాలూ వాళ్ళకి నచ్చినందువల్లే మమ్మల్ని రమ్మని పిలిచి ఉంటారు కదా! కానీ నిన్న అమ్మాయికి ఇష్టంలేదని కబురుచేశారు. కారణం ఏమిటో అర్థంకాలేదు!"

"నాకు అర్థం అయింది!"

"నీకా...? ఏమిటీ...?

"నువ్వు ఆ అమ్మాయితో మాట్లాడినప్పుడు నీకు కథలు రాయాలనే కోరిక ఉందని చెప్పావు కదూ?"

"లేదే...!"

"చెప్పలేదా...?! అయితే ఆ అమ్మాయి చాలా తెలివైనదన్నమాట! నువ్వు చెప్పకపోయినాగానీ నీలోని ఆ వాసనని పసిగట్టేసింది! మీ పెళ్ళి అయితే... నువ్వు రాయబోయే కథలకి తానే ఏకైక పాఠకురాలిగా ఉండాలనే నిజం తనని బాగా భయపెట్టినట్లుంది! 'పెళ్ళికాకపోతే ఏమయిందిలే, ఉద్యోగం చేసుకుంటూ ప్రశాంతంగా బతకొచ్చు' అనుకుని ఇష్టంలేదని ఇంట్లో చెప్పి ఉంటుంది!"

రవీంద్రనవ్వాడు...

"నిజంగా అదే కారణమని తెలిస్తే, నేను కథల్ని రాయగలిగినాగానీ, చదవమని ఇబ్బందిపెట్టనని హామీ పత్రం ఇవ్వగలను! కారణం ఏమిటో తెలుసుకోవాలని నాకు మహా ఇదిగా ఉంది! మా ఇంట్లోవాళ్లేమో... 'మన సంబంధం వద్దనుకున్న వాళ్ళని కారణం ఏమిటని అడగాల్సిన ఖర్మ మనకేమీలేదు' అంటూ ఊరుకున్నారు! అందుకే నేను నిన్నాశ్రయించాను."

"నీకు ఆశ్రయం ఇవ్వటానికి నాకేం అభ్యంతరం లేదు! నీకిష్టం వచ్చినన్ని రోజులు మా ఇంట్లో ఉండిపో...!"

"నీకు వేళాకోళంగా ఉంది! నిన్నెవరైనా కాదని అని ఉంటే... నాబాధ నీకర్థమయ్యేది!"

"కోపం వద్దులే...! నేనేం చేయాలో చెప్పు"

"అలా అడుగు... చెబుతాను. పెళ్ళికూతురు పేరు నర్మద... మేం వాళ్ళింటినుంచి వచ్చేసే ముందు నర్మద స్నేహితురాలు ఒకమ్మాయి వచ్చింది. తన క్లోజ్ ఫ్రెండ్ అనీ, పేరు సరళఅనీ నర్మద

మా చెల్లెలు పద్మకి పరిచయం చేసిందట. సరళా, మీ చెల్లెలు రాణీ ఒకసారి ఎక్కడో కనిపించారని మా పద్మ నాతో అంది. అంటే సరళ మీ రాణికి కూడా ఫ్రెండు కాబట్టి తన ద్వారా మా సంబంధాన్ని నర్మదా వాళ్ళు ఎందుకు వద్దనుకున్నారో తెలుసుకోవాలి. ఏదో యథాలాపంగా తెలుసుకోవాలి తప్ప మేం అడగమన్నట్లుగా కాదు. ఎలా అడగాలంటే..."

"మరీ అంత అక్షరమక్షరం చెప్పనక్కర్లేదులే... ఆ మాత్రం తెలివితేటలు నాకూ ఉన్నాయి! త్వరలోనే సంగతేమిటో తెలుసుకుని చెబుతాను గానీ... సాయంకాలం ఏదైనా సినిమాకి వెళ్దామా...?"

రవీంద్ర తల అడ్డంగా ఊపాడు. "నాకీవేళ కథ రాయాలనే మూడ్ వచ్చింది. కథ పేరేమిటో తెలుసా... కల్యాణరాగం! నువ్విక్కడుండే ఈ పదిరోజుల్లో ముగించి నీకు చూపించాలనుంది. అందువల్ల ఇల్లు, ఆఫీసు తప్పించి ఇంకేం ప్రోగ్రాములూ లేవు!"

"సరదాగా సినిమాకి వెళ్దామంటే... కాగితాలతో కుస్తీ పడతానంటున్నావ్! ఏం చేస్తాం... సరే కానీ... ఎవరి పిచ్చి వారికానందం అన్నారుగా మరి!" నవ్వుకుంటూ వేణు వెళ్ళిపోయాడు.

"హమ్మయ్య! సగం పని పూర్తయినట్లే!" తేలికగా నిట్టూర్చాడు రవీంద్ర.

* * * * *

ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునేటపుడు రవీంద్ర, వేణు స్నేహితులయ్యారు. చదువు పూర్తయ్యాక రవీంద్రకి సొంతవూరు విజయవాడలో ఉద్యోగం వస్తే, వేణుకి హైదరాబాద్‌లో వచ్చింది. వేణు తండ్రికి ఆరునెలల క్రితం విజయవాడకి ట్రాన్స్‌ఫర్ అయింది. అందువల్ల వేణు సెలవుపై ఇంటికి వచ్చినప్పుడల్లా స్నేహితులిద్దరూ కలుసుకునే అవకాశం కలుగుతోంది. ఈసారి వేణు సంక్రాంతికి ఇంటికి దగ్గరుండేట్లుగా పదిహేను రోజుల సెలవుపై వచ్చాడు. తనని కలుసుకోవటానికని వచ్చిన వేణుకి రవీంద్ర తన పెళ్ళిచూపుల తతంగం వివరించి, ఆది విఫలమైన కారణాన్ని కనుక్కోమని అర్థించాడు. ఆ బాధ్యతని వేణూ ఆనందంగా స్వీకరించాడు.

* * * * *

పదిరోజుల తరవాత ఇంటికి వచ్చిన వేణుకి ఎదురెళ్లి...

"ఏంట్రా... ఇన్నాళ్ళూ కనిపించకుండా పోయావ్...! సంగతేమిటో తెలిసిందా...?" అని అతృతగా ప్రశ్నించాడు రవీంద్ర.

"అంత తొందరెందుకోయ్... చెబుతానుగా...!" అంటూ స్థిమితంగా కూర్చుని నిదానంగా చెప్పటం మొదలుపెట్టాడు.

"వెదకబోయిన తీగ కాలికి తగలటమంటారే... అలా జరిగింది! నేనిక్కడ నుంచి వెళ్ళినరోజే ఆ సరళ మా రాణీకి ఫోను చేసి ఎక్కడో మ్యూజిక్ ప్రోగ్రాం ఉందని చెప్పి వెళ్దామా అనడిగింది. నువ్వు నాకు చెప్పిన పని రాణీకి చెప్పాను. ఏదో అడగమంటే అడుగు తాను కానీ ఇన్ డైరెక్టుగా, లౌక్యంగా అడగటం నాచేతకాదు. కావాలంటే నీకు పరిచయం చేస్తాను. నువ్వే అడుగు అనేసింది. ఇక ఏం చేస్తాం సరేనని నేనూ వెళ్ళాను. అలా అక్కడ ఆ రోజు పరిచయం జరిగింది. మరునాడేమో..."

"మొదటి రోజు పలకరింపులూ.. పరిచయాలూ, రెండో రోజు పరిహాసాలు.. మూడో రోజు ముచ్చట్లు... ఇలా రోజు వారీ ప్రోగ్రెస్ రిపోర్టు అవసరంలేదు గానీ మొత్తంమీద విషయం ఏమిటో చెబితే సరిపోతుంది" వేణు మాటలకు మధ్యలోనే అడ్డం తగిలి రవీంద్ర అన్నాడు.

"అబ్బ...! మాటకి మాట అప్పచెప్పటంలో నువ్వు నిజంగా అప్పాజీ అంతటివాడివిరా..!"

"అప్పాజీయా... ఆయనెవరూ...?"

"ఇంకెవరూ... నువ్వే! నీకు నువ్వే సాటి అని చెప్పటానికి వెరైటీగా అలా అన్నాలే! ఇంటి దగ్గర్నుండి వచ్చిన డబ్బంతా మొదటి వారంలోనే ఖర్చుచేసేసి... ఆ తరవాత నెలంతా అందరి దగ్గరా అప్పులు చేసేవాడివని నీకు కాలేజీరోజుల్లో 'అప్పాజీ' అని నిక్‌నేమ్ పెట్టారుగా!"

"అదేం కాదు. అందరికీ సలహాలు ఇస్తూ గొప్పగా ఉండేవాడినని అందరూ గౌరవంగా అలా పిలిచేవాళ్లు... నీకర్థంకాలేదు గానీ! ఇంతకీ అసలు విషయం చెప్పలేదు నువ్వు"

"తొందరపడకూ...! చెబుతున్నాగా, క్లుప్తంగా చెప్పటం కుదరదు. వివరంగా చెబితేగానీ నీకర్థంకాదు మరి! సరళ కాలేజీకిపుడు సెలవులట. 'అక్కడికి వెళ్దామా, ఇక్కడికి వెళ్దామా' అని రాణీతో ప్రోగ్రాం పెట్టి నాతో 'మీరూ రాకూడదూ?' అనేది. దాంతో నేను పనిగట్టుకుని తనతో పరిచయం పెంచుకోవాల్సిన పని తప్పింది. సరళ భలే సరదా అయిన అమ్మాయిలే! ఎంత బాగా నవ్వుతుందనుకున్నావ్...! ఒక్కోసారి ఎందుకోగానీ, ఏదో గుర్తుకు వచ్చినట్లుగా తనలో తనే తమాషాగా నవ్వుకుంటుంది...!"

"అవునుగానీ, అసలుదారి వదిలిపెట్టి బండి పక్కదారి పట్టినట్లుందే...!"

"చక్కనైన అమ్మాయి కనిపించినప్పుడు చూపు అటువేపు మళ్ళటం సహజం గదా! అంతేగాని అసలు పని మర్చిపోలేదులే! మొదటి రోజే అడిగితే బావుండదని సమయం చూసి అడగొచ్చుననుకున్నాను. ఈ వారం రోజులూ అక్కడికీ, ఇక్కడికీ అంటూ ముగ్గురం తిరుగుతూనే ఉన్నాం. ఒక రోజు మేం ఎగ్జిబిషన్ నుంచి వస్తోంటే... నీ నయాగరా... అంటే... నర్మద... వాళ్ళ వాళ్ళతో వెళ్తూ కనిపించింది. దూరం నుండి సరళ చూపించింది".

రవీంద్ర ఎగ్జయిటింగ్‌గా వేణు చేయిపట్టుకుని "అయితే నర్మదని నువ్వు చూశావా...! ఎలా ఉంది...? నే చెప్పినట్లే ఉంది కదూ...?" అన్నాడు.

"మన పెద్దలు 'తావలచింది రంభ' అని ఎందుకన్నారో అర్థం అయింది!" అన్నాడు నవ్వును దాచుకుంటూ.

"నీకు క్లోజప్ తప్పించి లాంగ్‌షాట్‌లో ఏమీ కనిపించవని అందరూ అంటే ఏమో అనుకున్నాను గానీ, అది కరెక్టేనని నాకూ ఇప్పుడు అర్థం అయింది! కళ్ళడాక్టరు దగ్గరికి వెళ్ళమంటే వెళ్ళవ్... సరే, నీ ఖర్మగానీ... అసలు విషయం మాత్రం చెప్పటం లేదు!"

"విషయం... విషయం అంటూ విసిగించేస్తున్నావ్... చెబుతున్నాగా... ఎక్కడి వరకూ చెప్పానూ... ఆఁ సరళ ఎంత అందంగా నవ్వుతుందనుకున్నావ్...! నవ్వు మాత్రమే కాదు..."

"రూపమూ... అపూర్వమే! మాటల్లో మకరందాలు.. నడకలో మయూరి వయ్యారాలు...! టోటల్‌గా అందాల అపరంజి బొమ్మ! అవునా...?"

"అబ్బ...! అంత కరెక్టుగా ఎలా చెప్పగలిగావురా! అసలు సరిగా చూడనేలేదు అన్నావుగా...?"

"నేను చెప్పింది సరళ గురించి కాదు, రంభ గురించి!"

"అదేమిటీ...?"

స్విచ్ నొక్కితే బల్బు వెలిగినట్లుగా... సరళ ప్రసక్తి రాగానే నీ మొహం ఎలా తళతళలాడిపోతోందో గమనించాక, తనంటే నీకెంత ఇష్టం ఏర్పడిందో అర్థమైంది! 'తావలచింది రంభ' అన్నారుగా పెద్దలు... అందుకే నేను రంభని వర్ణిస్తే, ఆ వర్ణన సరళకి సరిగ్గా సరిపోయిందన్నావ్! ఇకనైనా అసలు విషయంలోకి వస్తే సం...తో...షి...స్తా!"

వేణు నవ్వి, "కారణం ఏమిటంటే... స్పందన!" అన్నాడు.

రవీంద్ర ఆశ్చర్యంగా "స్పం...ద...నా...? ఆ క్యారెక్టరు ఎవరూ...? అన్నాడు.

"ఆ మధ్య అమ్మావాళ్ళతో కలిసి నేనూ ఒకసారి పెళ్లిచూపులకి వెళ్ళాను. గుర్తుందా?" వేణు అడిగాడు. రవీంద్ర కొంచెం అసహనంగా "ఆ చరిత్ర ఇప్పుడు అంత అవసరమా...?" అన్నాడు.

"సందర్భం ఉంది కాబట్టే అడిగాను. లేకపోతే అదేం మధురస్మృతి కాదుగా... కారణం లేకపోయినాగానీ మళ్ళీమళ్ళీ నెమరువేసుకోవటానికి...!"

"గుర్తులేకపోవటమేముంది! మీ ఇంట్లో వాళ్లు అమ్మాయి బాగానే ఉందన్నారు, నువ్వేమో... ఆ అమ్మాయిని చూస్తోంటే, మనసులో ఎటువంటి స్పందనా కలగలేదు.. నిర్వికారంగా అనిపించింది' అని చెప్పి ఆ సంబంధం కాన్సిల్ చేయించావు! అంతేగా! ఇంకొక సంబంధం చూసి నువ్వు మళ్ళీ వచ్చినప్పుడు పెళ్ళిచూపులకు వెళ్ళాలని మీ ఇంట్లో వాళ్ళు అంటే... 'నాకు నచ్చిన అమ్మాయి తటస్థపడినప్పుడు ప్రేమించి పెళ్ళి చేసుకుంటాగానీ, ఎక్కడికీ ఇక పెళ్ళి చూపులకి రాను' అని మొండికేశావ్! నీ ధోరణికి ఆంటీ వాళ్ళు బాధపడ్డారు. అప్పుడు నేను 'ఎవరితోనైనా ప్రేమలో పడితే, పెళ్ళిచేసుకోవాలని అనుకోవటం బాగానే ఉంటుంది కానీ... ఎవరిని ప్రేమించాలా అని ఎదురు చూస్తూ, పెద్ద వాళ్ళు తెచ్చిన మంచి సంబంధాలను కాదనుకోవటం సమంజసం కాదు' అంటూ నీకు క్లాసు తీసుకున్నాను కూడా! అవునా...?"

"అబ్బ... పూస గుచ్చినట్లుగా చెప్పేశావ్ కదరా...! నీ జ్ఞాపకశక్తికి నా జోహార్లు...' ఇక్కడా సరిగ్గా అలాంటి సందర్భమే వచ్చింది! ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... సరళ ఆలోచనలూ, నావీ సరిగ్గా ఒకే రకమైనవి! సరళ..."

"నువ్వు సరళ నామస్మరణ ఆపేసి అ...స...లు విషయం..."

"ఎందుకురా అంత అసహనం...! సరళే ఇక్కడ అసలు కథానాయకురాలు మరి! మీరు నర్మదా వాళ్ళింటి నుంచి వచ్చేశాక, సరళ నర్మదని 'పెళ్ళికొడుకుని చూసినప్పుడు నీకేమనిపించిందీ...? అని అడిగిందట. బాగానే ఉన్నాడని అనుకున్నానని నర్మద జవాబు చెప్పింది. 'మనసులో ఎటువంటి స్పందనా కలగలేదా?' అనడిగితే లేదని జవాబు చెప్పిందట.

అప్పుడు ఈ సరళగారు నర్మదకి గీతాబోధ చేసిందట! 'సరిజోడీ అయిన వ్యక్తితో పెళ్ళి జరిగితేనే, కాపురం అచ్చట్లు ముచ్చట్లతో సరదాగా సాగుతుంది... అలా కాకుండా మనిషి బాగానే ఉన్నాడని చేసేసుకుంటే, ఆ సంసారం చప్పగా, యాంత్రికంగా ఉంటుంది... అందుకని సరిజోడీ అయిన వ్యక్తి తటస్తపడే వరకూ ఎదురుచూడాలి కానీ తొందరపడకూడదు... ఎవరిని చూడగానే మన గుండె గడియారం అలారం మోగిస్తుందో... మనసులో తీయని అలజడి రేగుతుందో... ఆ వ్యక్తినే మనం తెలివిగా ఎన్నుకోవాలి! లేకపోతే ఎక్కాల్సిన రైలు కాకుండా, ముందు వచ్చిన రైలుని తొందరపడి

ఎక్కినట్లుగా ఉంటుంది మన పరిస్థితి అని విపులంగా విశదీకరించి చెప్పగానే నర్మదకి జ్ఞానోదయం కలిగి, గుండె గడియారం అలారం కొట్టే వరకూ వేచిఉండాలని, నిర్ణయించుకుందట! అందుకే ఇంట్లో ఇష్టం లేదని చెప్పిందన్నమాట! అదీ సంగతి!"

రవీంద్ర భారంగా నిట్టూర్చాడు.

"నన్ను చూసినప్పుడు ఆ అమ్మాయి మనసు కల్లోలసాగరమై పోకుండా ప్రశాంతంగా ఉండిపోవటమే ఈ పెళ్ళి కుదరకపోవటానికి కారణమన్నమాట! ఏం చేస్తాం... నా బేడ్ లక్!"

"అంత నిరుత్సాహపడకు. ఇంకా ఉంది... విను. సరళ ఇదంతా చెప్పగానే నాకు చిర్రెత్తుకొచ్చింది. నిజానికి ఒకప్పుడు నేనూ ఇలాగే మాట్లాడాననుకో! ఇప్పుడు నీ విషయంలో ఇలా జరిగేసరికి అప్పుడు నేనెంత అసమంజసంగా ప్రవర్తించానో అర్థమైంది. అందుకే అప్పుడు నాకు నువ్వు తీసుకున్న క్లాసునే సరళ దగ్గర రిపీట్ చేశాను!

'ఏదైనా గమ్యం ఉన్నప్పుడు, అక్కడికి వెళ్లే రైలు కోసం నిరీక్షిస్తూ ప్లాట్‌ఫామ్ మీద నిలబడటం బాగానే ఉంటుంది... అంతేకానీ ఏ రైలు ఎక్కాలో తెలియకుండా ప్లాట్‌ఫామ్ మీద రైలు కోసం ఎదురుచూడటం.. ఎంత తెలివి తక్కువ పనో, నీ స్నేహితురాలికి నువ్వు ఇచ్చిన సలహా కూడా అలాంటిదే' అంటూ సరళ బ్రెయిన్ వాష్ చేశాను! దాంతో ఆ సరళ తను చేసిన తెలివి తక్కువ పనికి లెంపలు వేసుకుంది. నేను నీ క్వాలిఫికేషన్సు గురించీ, గుణగణాల్నీ వివరించి చెప్పేసరికి మరింత బాధపడి, తను చేసిన తప్పును తనే సరిదిద్దుతానని ఈ రోజే వాళ్ళింటికి పరుగెత్తింది!

అర్థమైందిగా... మూడొంతులు ఆ అమ్మాయితోనే నీ పెళ్ళి నిశ్చయమవుతుంది. నిశ్చింతగా ఉండు!" వేణుచెప్పటం పూర్తికాగానే రవీంద్ర మొహం ఇం...త చేసుకుని "నిజమా... అలా జరుగుతుందా?" అని ఆనందంగా అడిగాడు.

"తప్పకుండా జరుగుతుంది! రేపో, ఎల్లుండో అదీ చెబుతానుగా" అంటూ వేణు వెళ్ళిపోయాడు. రెండు చేతులూ పైకెత్తి పిడికెళ్ళు బిగించి 'సాధించానుగా...!' అంటూ ఆనందంతో అరిచాడు రవీంద్ర.

రెండు రోజుల్లోనే వేణు రవీంద్రకి ఫోన్ చేశాడు.

"హలో... రవీ... ఏం చేస్తున్నావురా...?"

"చేసేదేముందీ... నువ్వామాట చెప్పి వెళ్ళిన దగ్గర్నుండీ, నా ఆలోచనలన్నీ నర్మద వేపే ప్రవహిస్తున్నాయి.

మేమిద్దరం చేయీ చేయీ పట్టుకుని కోనసీమ కొబ్బరితోటల మధ్య షికారు చేస్తున్నట్టూ. గోదావరి ఒడ్డున నిలబడి గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటున్నట్టూ... ఒకటే కలలు..."

"తనువంతా తీయని పులకింతల అలలు... అవునా...!" రవీంద్రమాటలను అందుకుని వేణు పూర్తి చేశాడు.

"సింగినాదం కాదూ... సింగరేణి బొగ్గు గనుల మధ్య బొమ్మలాట లాడుకుంటున్నట్లుగా లేదూ... ఇలా ఈ టైపులో వేళాకోళంగా ఏదో అంటావని నేననుకుంటూ ఉంటే, నువ్వేమో నా మాటల్ని అందుకుని అందంగా అల్లుకుపోయావ్! ఏదో ఉన్నట్లుగా ఉంది. ఏమిటి సంగతి...?"

“ప్రస్తుతం మనిద్దరిదీ ఒకటే పరిస్థితి మరి! అందుకే మాటలు అలా కలిశాయ్! సరే... అదంతా వేరే కథ కాబట్టి తరవాత చెబుతాలే. సరళ చెప్పినట్లే చేసింది. నర్మదా వాళ్ళ పెద్ద వాళ్ళు ఈవేళో, రేపో మీ ఇంటికి వచ్చి పొరపాటు జరిగిందని ఒప్పుకుని ముహూర్తాలు పెట్టుకుందామని అడుగుతారట! బెట్టు చేయకుండా ఒప్పుకోండి.”

“థేంక్స్‌రా...! నా కోసం చాలా శ్రమ తీసుకున్నావ్!” ఆనందంతో అరచినట్లుగా అన్నాడు రవీంద్ర.

“నిజమే... చాలా శ్రమపడ్డాను. సరళతో పరిచయాన్ని స్నేహంగా మలచుకుని, చనువుని పెంచుకున్నాను! ఏదో జనరల్ టాపిక్ మాట్లాడుకున్నట్లుగా సంభాషణను పెళ్ళిచూపుల సబ్జెక్టు దగ్గరకు లాక్కెళ్ళి... ఆ తరవాత తనే నర్మద గురించి చెప్పేట్లుగా దారి మళ్ళించి... అప్పుడు నీ గురించి గొప్పగా చెప్పి... చూశావా ఎంత ప్లాన్డ్‌గా చేసుకువచ్చానో... అందుకే ఒట్టి మాటలు కాకుండా గ్రాండ్‌గా ఫైవ్‌స్టార్ హోటల్‌లో పార్టీ ఇవ్వాలి – రేపు ముహూర్తాలు పెట్టుకోగానే...!”

“తప్పకుండా కానీ స్టార్ హోటల్ వద్దులే... బిల్లు చూసి భయపడతావ్!”

“బిల్లు చూశాక పార్టీ ఆనందం అంతా ఆవిరైపోతుందని నేనంటూ ఉంటాననేగా స్టార్ హోటల్ వద్దంటున్నావ్? ఖర్చు నీదయితే నాకెందుకూ భయం...? బాగా ఎంజాయ్ చేస్తా! రెడీగా ఉండు” అంటూ వేణు ఫోన్ పెట్టేశాడు.

“సక్సెస్... గ్రాండ్ సక్సెస్...!” అంటూ రెండడుగులు గాల్లోకి ఎగిరాడు రవీంద్ర.

మరునాడు సాయంకాలం రవీంద్ర దగ్గరకు వచ్చిన వేణు “నిన్న సాయంకాలం మీ పెళ్ళికి ముహూర్తాలు పెట్టారంటగా! సరళ చెప్పింది. పార్టీ ఇస్తానని ప్రామిస్ చేశావుగా. పద... వెళ్దాం. సరళ వాళ్ళని కూడా రమ్మని పిలవనా..?” అంటూ హడావుడి చేశాడు.

“అలాగే వెళ్దాం స్టార్ హోటల్ అంటున్నావుగా... నీ పర్సు బరువు సరిపోతుందో, లేదో ఒకసారి చూసుకో, అవునూ... సరళతో నీ పెళ్ళి ఫిక్స్ అయిందటగా!”

“నేను చెబుతానని అంటే అమ్మ వినకుండా నీకు ఫోన్ చేసి చెప్పేసిందన్నమాట! సరళను చూపించి నాకు నచ్చిందని చెప్పగానే అమ్మావాళ్ళు వెంటనే ఒప్పుకున్నారు. పెద్ద వాళ్ళు అందరూ కలిసి మాట్లాడుకుని వచ్చే నెలలో నిశ్చితార్థం జరపటానికి నిర్ణయించుకున్నారు. నా పెళ్ళి పార్టీ తరవాత ఇస్తాను. అది పూర్తిగా వేరే కథ కదా! నీ పెళ్ళిని కుదిర్చినందుకు ఇప్పుడు నువ్వు పార్టీ ఇస్తున్నావుగా! నా పర్సు సంగతి ఎందుకూ...?”

“ఎందుకంటే... పార్టీ నువ్వే ఇస్తున్నావ్. నేను కష్టపడి రాసిన నీ పెళ్ళి కథ కోసం! నీది వేరే కథ కాదు. ఇక్కడ రెండు కథలేం లేవు. ఒకటే కథ! వచ్చే నెలలో జరిగే నా పెళ్ళికి ముహూర్తాలు నిన్న పెట్టలేదు. ఎపుడో మూడు వారాల కిందటే నిశ్చతార్థం జరిగింది! నర్మద మాకు బాగా తెలిసిన వాళ్ళమ్మాయే. మరి ఇదంతా ఏమిటంటావా? అసలు విషయం ఇప్పుడు చెబుతాను... విను.

మా పద్మ సంగీతం నేర్చుకోవటానికి ఈవెనింగ్ క్లాసులకి వెళ్తోంది. అక్కడ ఒకమ్మాయితో స్నేహం కలిసింది. ఆ అమ్మాయి ఒకబ్బాయి ఫోటో చూపించి నాలుగు రోజుల్లో పెళ్ళి చూపులకి

వాళ్ళింటికి వస్తాడని చెప్పింది. ఆ తరవాత కారణం ఏమీ చెప్పకుండానే రావటం లేదని కబురు చేశారని నిట్టూరుస్తూ పద్మతో చెప్పింది. నువ్వు కిందటి నెలలో ఆఫీసు పనిమీద ఎక్కడికో వెళ్తూ, ఇక్కడ ఒకరోజు ఆగావు చూడు అప్పుడు మా ఇంటికి వచ్చావుగా, మా పద్మ నిన్ను చూసి తన స్నేహితురాలు చూపించిన ఫోటోలోని అబ్బాయి నువ్వేనని గుర్తు పట్టింది.

'అందం, తెలివితేటలు, మంచి స్వభావం... అన్నీ ఉన్న సరళలాంటి అమ్మాయిని చూడకుండానే వద్దనుకున్న ఆ ప్రబుద్ధుడెవరో అనుకున్నానుగానీ నీ ఫ్రెండేనన్న మాట!' అని పద్మ నాతో అంది. ప్రేమించి పెళ్ళి చేసుకుంటానంటూ పెళ్ళిచూపులకి రానని నువ్వు గొడవ చేస్తున్న సంగతి నాకు తెలుసుకదా! అప్పుడు నా మనసులోకి ఒక ఆలోచన వచ్చింది. ఆ కథని వెంటనే ఆంటీకి చెప్పి ఓకే చేయించుకున్నాను. ఇక రాణీ వాళ్ళంతా యాక్ట్ చేయటానికి ఆనందంగా అంగీకరించారు. నువ్వు రాగానే డైరెక్షన్ మొదలు పెట్టేశాను. నేను అనుకున్నట్లుగానే తేడా ఏం లేకుండా, సెంట్ పర్సెంట్ కరెక్టుగా యాక్ట్ చేశావ్... కాదు రియాక్టయ్యావ్! ఎందుకంటే, ఇది నీ కోరిక ప్రకారం పెళ్ళి చూపుల సీను లేకుండా, పరిచయం... స్నేహం... ప్రేమా... పెళ్ళి... ఈ వరుస క్రమంలో నడిచిన కథకదా... కల్యాణరాగం...!

నర్మదకీ, సరళకీ ఫ్రెండ్‌షిప్ లేదు. ఈ మధ్యనే రాణీ పరిచయం చేసిందంతే! ఇక సందేహాలేం లేవుగా...! అర్థమైందిగా...! ఒకటి గుర్తుపెట్టుకో. పెళ్ళయ్యాక... ఇంకెవరినో చూసి నీ గుండె గడియారం అలారం కొట్టే పరిస్థితి మాత్రం రాకుండా చూసుకోవాలి. లేకపోతే తీయని అలజడుల మాట అటుంచి, కాపురం కల్లోలం అయిపోతుంది. జాగ్రత్త!"

ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయిన వేణు, రవీంద్ర చెప్పటం పూర్తి చేసిన నాలుగు నిమిషాలకిగాని పైకి తేలలేదు. తేలాక... తేరుకున్నాక, ఆనందంతో పెద్దగా నవ్వాడు.

రవీంద్ర చేతులు పట్టుకుని, "థేంక్స్ అనే మాట సరిపోదు నువ్వు ఇచ్చిన థ్రిల్‌కి! పార్టీ ఏమిటి... నువ్వేం అడిగినా ఆనందంగా ఇచ్చేస్తాను!" అన్నాడు హుషారుగా భుజాలెగురవేస్తూ.

"నీ మొహంలోకి అప్పుడే పెళ్ళి కళ వచ్చేసిందిరా... ఇంత చింతపండేసి తోమిన ఇత్తడి తపేలాలాగ తళతళలాడిపోతోంది..." రవీంద్ర అన్నాడు పెద్దగా నవ్వుతూ.

ఈనాడు ఆదివారం. 15, సెప్టెంబరు, 2002.